సాక్షి రంగారెడ్డి

గురువారం। 9। నవంబర్। 2023

సీపీఎం నుంచి బహిష్కరణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రావుల జంగయ్యను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, క్రమ శిక్షణ ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

రక్తదాన శిబిరం విజయవంతం

నందిగామ: మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా కాన్హాతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 90 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

మీర్‌పేట: ఓటు ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక కార్పొరేషన్‌లో ఓటు హక్కుపై కమిషనర్ అల్లూరి వాణితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతి ఒక్క రూ ఓటు వినియోగించుకుని సరైన నాయ కున్ని ఎన్నుకోవాలని సూచించారు.

మద్దతుదారులతో వచ్చి.. నామినేషన్ వేసి



మహేశ్వరంలో నామినేషన్ సమర్పిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి తరపున నామినేషన్ వేస్తున్న మద్దతుదారులు



ఆమనగల్లు: కల్వకుర్తి నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్

న్యూస్‌రీల్

బీజేపీ వెంటే జనం

కేంద్ర మంత్రి మహేంద్రనాథ్‌పాండే


విక్టరీ సింబల్ చూపుతున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్‌పాండే తదితరులు

ఇబ్రహీంపట్నం: తెలంగాణలోని అన్నివర్గాల ప్రజలు బీజేపీ వెంటే ఉన్నారని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. మహారాష్ట్ర ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి సందీప్‌దుర్వేతో కలిసి బుధవారం ఆయన బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్ గౌడ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామని బీజేపీ ఇప్పటికే ప్రకటించిందన్నారు. మెజార్టీ స్థానాలు గెలుస్తామని, నరేంద్ర మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రజలను మోసం చేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రజల కలలను సాకారం చేస్తుందన్నారు. ఇబ్రహీంపట్నంలో కమలం వికసించి కాషాయ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు.

పరిశ్రమలకు స్వర్గధామం తెలంగాణ


లిండ్‌స్ట్రోం పరిశ్రమను సీఈఓతో కలిసి ప్రారంభిస్తున్న జయేష్ రంజన్

నందిగామ: పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు మన రాష్ట్రం ఎంతో అనుకూలంగా ఉందని, ఇప్పటికే అనేక రకాలైన పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పగా, మరెన్నో పరిశ్రమలు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయని పరిశ్రమలు, వాణిజ్యశాఖల ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. మండల పరిధిలోని మేకగూడ శివారులో నెలకొల్పిన లిండ్ స్ట్రోం పరిశ్రమను సీఈఓ జుహాలారియోతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు సులభతరంగా అనుమతులు ఇవ్వడంతో పాటు రెడ్ కార్పెట్ పరుస్తోందని చెప్పారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న ఫార్మా పరిశ్రమల్లో ప్రపంచంలోని మూడింట ఒక వంతు వ్యాక్సిన్లు తయారవుతున్నాయని వివరించారు. అంతే కాకుండా ఐటీ, మ్యానుఫాక్చరింగ్ పరిశ్రమలు నెలకొన్నాయని, వాటితో ఎంతో మందికి ఉపాధిసైతం లభిస్తోందన్నారు. అనంతరం పరిశ్రమ సీఈఓ జుహా లారియో మాట్లాడుతూ.. దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద క్లీన్ రూం సదుపాయాన్ని ఇక్కడ కల్పించినట్టు వెల్లడించారు. ఈ పరిశ్రమలో సుమారు వెయ్యి మందికి ఉపాధి లభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ గ్రూప్ సీఈఓ జుహాలారియో, అసియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనుపమ్ చక్రవర్తి, పరిశ్రమ ప్రతినిధి కిమ్, ఎండీ జయంత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

కదలికలపై పక్కా నిఘా



అభ్యర్థులు, వారి బంధువులు, ముఖ్య నాయకులే టార్గెట్

- తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసు, ఎక్సైజ్, ఐటీ శాఖలు
- ఇప్పటి వరకు 451 కేసులు.. రూ.28.56 కోట్ల నగదు స్వాధీనం
- 59.22 కిలోల బంగారం, 58.81 కేజీల సిల్వర్ సీజ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అభ్యర్థుల కదలికలపై ఎన్నికల సంఘం గట్టి నిఘా పెట్టింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులే కాదు, వారి బంధువులు, ముఖ్య నాయకుల కదలికలపై సైతం దృష్టి సారించింది. ఎన్నికల వ్యయ పరిశీలకులే కాదు పోలీసు, ఎక్సైజ్, ఐటీ, ఇతర కేంద్ర నిఘా సంస్థలు అభ్యర్థుల చుట్టే మోహరించాయి. ఏ రోజు ఎవరు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎవరెవరిని కలుస్తున్నారు? అనేదానిపైనే కాకుండా ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం నియోజకవర్గానికి ఒక వ్యయ పరిశీలకుడిని నియమించింది. వీరంతా జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు, ఐటీ, ఎక్సైజ్ విభాగాల అధికారులతో సమావేశమై శాంతిభద్రతల అంశాన్ని చర్చించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా ఎంపిక చేసిన తనిఖీ బృందాలు.. ఇప్పటి వరకు నమోదు చేసిన కేసులు, సీజ్ చేసిన నగదు, మద్యం, ఇతర వస్తువులపై వారు ఆరా తీస్తున్నారు. నిఘా సంస్థలు వెంటాడుతుండటంతో అభ్యర్థులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

ఇప్పటి వరకు రూ.28.56 కోట్లు సీజ్

పోలీసు తనిఖీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఏ ఆధారాలు లేని రూ.28.56 కోట్ల నగదు సీజ్ చేశారు. 59.22 కిలోల బంగారం, 58.81 కిలోల వెండి, 260 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. రూ.47.81 లక్షల విలువ చేసే చీరలు, వంటపాత్రలు, ఇతర వస్తువులను సీజ్ చేయడం విశేషం. జిల్లా వ్యాప్తంగా రూ.50 వేలకు మించి నగదు, బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను వెంట తీసుకెళ్తూ పోలీసులకు 451 మంది పట్టుబడగా, వీరిలో 344 మంది గ్రీవెన్స్ కమిటీకి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 129 మంది అభ్యర్థనలను, వారు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, వారికి రూ.3.96 కోట్ల విలువ చేసే నగదు, బంగారు ఆభరణాలను తిరిగిచ్చేశారు. రూ.10 లక్షలకుపైగా వెంట తీసుకెళ్తూ పోలీసులకు పట్టుబడిన మరో 28 కేసులను (రూ.7,05,74,517) ఐటీశాఖకు అప్పగించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

సమన్వయంతో పని చేయాలి

ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి జిల్లాలో ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలతో పాటు, ఇతర బృందాలు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తున్న బృందాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నామినేషన్లు పూర్తయిన తర్వాత ఫిర్యాదులు పెరిగే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని బృందాలన్నీ చురుగ్గా ఉండటమే కాకుండా, పనిని ఇంకా వేగవంతం చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన, అక్రమంగా తరలించే డబ్బు, మద్యం వంటివా టిని అరికట్టేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సీజ్ చేసిన వాహనాలు, మద్యం, డబ్బు వంటి అంశాలన్నింటినీ సమీక్షించడం జరుగుతుందన్నారు. జీపీఎస్ ట్రాక్ సిస్టం ద్వారా ఆయా బృందాల పనితీరును పరిశీలించనున్నట్లు వెల్లడించారు. సీజర్ టీం ఇంకా త్వరగా రెస్పాండ్ కావాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్/జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, ఎంసీసీ నోడల్ అధికారి సౌమ్య, డీసీఓ ధాత్రిదేవి, పోలీస్ టీం, ఎక్సైజ్ టీం, ఇన్‌కం టాక్స్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాచరిక పాలనకు స్వస్తి చెప్పండి

- కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

షాద్‌నగర్: తెలంగాణలో కొనసాగుతున్న రాచరిక పాలనకు స్వస్తి చెప్పాల్సిన అవసరం ఉందని.. బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని కేంద్ర జలవనరుల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య నామినేషన్ ర్యాలీ అనంతరం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్ వెనక మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతోందని అన్నారు. అన్ని వర్గాల ఆర్థిక పురోభివృద్ధి కోసం ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నారని అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతోందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించి యువతను మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విశ్వసనీయత కోల్పోయిందన్నారు. ఈసారి డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ టంగుటూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్

ఐదో రోజు @ 59

- ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు
- నేడు భారీగా దాఖలయ్యే అవకాశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ నెల 3న ప్రారంభమైన ఈ ప్రక్రియ బుధవారం ఐదో రోజుకు చేరింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల నుంచి 45 మంది అభ్యర్థులు 59 నామినేషన్ సెట్లు వేశారు. మహేశ్వరం నుంచి ఐదుగురు అభ్యర్థులు ఆరు నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. వీరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (రెండు సెట్లు), బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సబితారెడ్డి తరపున ఆమె మద్దతుదారులు ఒక సెట్ చొప్పున దాఖలు చేశారు. కల్వకుర్తి నుంచి ఆరు నామినేషన్లు దాఖలు కాగా, వీరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ రెండుసెట్లు దాఖలు చేశారు. షాద్‌నగర్ నుంచి ఎనిమిది నామినేషన్లు దాఖలు కాగా, వీరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, బీజేపీ అభ్యర్థి అందె బాబయ్య ఉన్నారు. ఇబ్రహీంపట్నం నుంచి ఐదు నామినేషన్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్ గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. ఎల్బీనగర్ నుంచి ఎనిమిది నామినేషన్లు దాఖలు కాగా, వీరిలో బీజేపీ అభ్యర్థి సామరంగారెడ్డి మూడు సెట్లు వేశారు. శేరిలింగంపల్లిలో 13 నామినేషన్లు దాఖలు కాగా, వీరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి అరికెపూడి గాంధీ నాలుగు సెట్లు అందజేశారు. ఇక చేవెళ్ల నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి సున్నపు వసంతం నామినేషన్ దాఖలు చేశారు. రాజేంద్రనగర్ నుంచి 12 నామినేషన్లు వచ్చాయి. గురువారం మంచి ముహూర్తం ఉండటంతో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

ప్రతిపక్షాలకు ఉనికే లేదు

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్: ప్రతిపక్షాలకు తెలంగాణలో ఉనికే లేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరు గ్యారంటీల పేరుతో తిరుగుతున్నారని.. కర్ణాటకలో అమలు చేయని పథకాలు తెలంగాణలో అమలు చేస్తామని చెబితే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆ పార్టీలో పదిమంది వరకు ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఓటు అడిగే హక్కు ఒక్క బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవబోతున్నట్లు చెప్పారు. ఎవరెన్ని చేసినా కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయ మని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నియోజకవర్గ కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, పార్టీ కార్యదర్శి శ్రీరాంరెడ్డి, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి



షాద్‌నగర్‌లో నామినేషన్ పత్రాలను ఆర్‌ఓకు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య



ఇబ్రహీంపట్నంలో నామినేషన్ పత్రాలు ఆర్‌ఓకు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్



ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి తరఫున ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి తదితరులు


చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సున్నపు వసంతం

తొలి ఓటు ఎవరికో!

యువ ఓటర్లపై అభ్యర్థుల నజర్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో తొలి ఓటు అత్యంత కీలకం. అందుకే మొదటిసారి ఓటు వేసేందుకు సిద్ధమవుతున్న యువ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డాయి ప్రధాన రాజకీయ పార్టీలు. గ్రేటర్‌లోని చాలా నియోజకవర్గాల్లో తొలి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో కీలకంగా మారాయి. 'నచ్చితే ఓటేస్తాం.. లేకపోతే నోటాకు సై అంటాం' అనే యువతరం ధోరణితో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. గతంలో ఎన్నికలు, ఓటు అంటే అంతగా ఇష్టం చూపని యువతరంలో క్రమంగా మార్పు వచ్చింది. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నించే తత్వం పెరిగింది. ఓటుతో సమాధానం చెప్పాలని నిర్ణయించుకునే స్థాయిలో వారి ఆలోచనా ధోరణిలో మార్పులొచ్చాయి.

ఉద్యోగాలు, అభివృద్ధే ఎజెండా..

గ్రేటర్ హైదరాబాద్‌లో 18– 19 ఏళ్లున్న ఓటర్లు 1.8 లక్షల మంది ఉండగా.. 18– 29 ఏళ్ల వయసున్న ఓటర్ల సంఖ్య 17.3 లక్షలు. ఈ యువ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. సాంకేతికత అందుబాటులో సమస్త సమాచారం అరచేతిలోకి వచ్చేసింది. దీంతో యువ ఓటర్ల సామాజిక ఆలోచనలు మారిపోయాయి. రాజకీయాలు, ఎన్నికలు, అభ్యర్థులు, అభివృద్ధి, ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉంటున్నారు. రాజకీయ పార్టీల విధానాలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ఎండగడుతున్నారు. అభ్యర్థుల గుణగణాలను ఉతికి పారేస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం, స్కాంలు, అవినీతి వంటి వాటిపై నిర్భయంగా ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి, ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగం కల్పించే పార్టీలకు ఓటు వేస్తామని పేర్కొంటున్నారు.

ఎన్నెన్నో పాట్లు..

యువ ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం, పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈ యువ ఓటర్లను చేరుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రాం వంటి సామాజిక మాధ్యమాల వేదికగా చేసుకుంటున్నాయి. షార్ట్ వీడియోలు, రీల్స్ చేస్తూ జోరుగా ప్రచారం చేస్తున్నాయి. కేటీఆర్, మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ వంటి పలువురు బీఆర్‌ఎస్ అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాలకు లక్షల సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నారు. బస్తీలు, కాలనీల్లోని యువ ఓటర్లను ఆకర్షించేందుకు క్రికెట్ కిట్లు, పండగలకు సాంస్కృతిక కార్యక్రమాలు, యువతుల కోసం ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్ వాచ్‌లు వంటివి పంపిణీ చేస్తున్నారు.

తెలంగాణ తేజం 'మర్రి'

తెలుగు ముఖ్యమంత్రుల్లో మర్రి చెన్నారెడ్డి ప్రత్యేకత చాటాడు. 1978లో దేశమంతా కాంగ్రెస్ వ్యతిరేకత, 1989లో ఎన్టీఆర్ ప్రభంజనంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఆయన సొంతం. ట్రబుల్ మేకర్ అండ్ షూటర్‌గా పేరున్నట్టే పదవులు వివాదాలు వెన్నంటే ఉండేవి.

ఐదు దశాబ్దాల రాజకీయంలో తనదైన ముద్ర





సిరిపురంలో చెన్నారెడ్డి స్వగృహం

- ఉమ్మడి రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చెన్నారెడ్డి
- నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా సేవలు
- 1969లో టీపీఎస్ ఏర్పాటు
- అనంతరం కాంగ్రెస్‌లో విలీనం



మర్పల్లి మండల కేంద్రంలోని నివాసం

జంగ్ తెలంగాణ

వికారాబాద్: మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మర్రి చెన్నారెడ్డి ఐదు దశాబ్దాల రాజకీయ దురంధురుడు. 1919 జనవరి 13న మర్రి లక్ష్మారెడ్డి, శంకరమ్మలకు జన్మించిన ఆయన అంచలంచెలుగా కీర్తి గడించారు. ప్రజల నాడీ తెలిసిన ఆయన రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన ట్రబుల్ మేకర్ మ్రాతమే కాకుండా ట్రబుల్ షూటర్ గానూ పేరు గడించారు. 1969లో తెలంగాణ ప్రజా సమితి పార్టీని స్థాపించి తొలి దశ తెలంగాణ ఉద్యమాన్ని ప్రజాల్లోకి తీసుకెళ్లారు. ఉమ్మడి రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా, దేశంలోని నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు.

విద్యాభ్యాసం

స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి విద్యావసతులు సరిగా లేక రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారంలోని మేనమామ కొండా వెంకట రంగారెడ్డి వద్ద ఉన్నత విద్యభ్యాసం పూర్తి చేసుకున్నారు. వికారాబాద్‌లో ఇంటర్ విద్య తర్వాత ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో ప్రభుత్వ డాక్టర్‌గా వైద్య సేవలందించారు. ఉద్యోగ రీత్యా నాగార్జున సాగర్‌కు బదిలీ అయింది. దీంతో ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి పాతబస్తీలోని ఫీల్‌ఖానాలో క్లినిక్ ఏర్పాటు చేసి ఏడాదిన్నర పాటు సేవలందించారు. అక్కడ నుంచి రాజకీయాల్లో అడుగుపెట్టిన ఆయన మేనమామపై ఉన్న కృతజ్ఞతతో 1979లో హైదరాబాద్ పరిసర ప్రాంతాలను కలుపుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి పేరిట రంగారెడ్డి జిల్లా ఏర్పాటు చేశారు.

తెలంగాణ ప్రజాసమితి ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర వెనుకబాటును గుర్తించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా 1969లో 'తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్)'ని స్థాపించారు. అప్పటి పార్లమెంటు ఎలక్షన్‌లో పార గుర్తుపై పోటీ చేసి 13 పార్లమెంటు సీట్లకు గాను 11 సీట్లను కైవసం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను బలంగా చూపింది. కాగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చొరవతో మళ్లీ ఆయన కాంగ్రెస్‌లో టీపీఎస్‌ను విలీనం చేశారు. తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న సమయంలో సీఎం జయలలిత పంపిన ఓ బిల్లును ఆమోదించాల్సి ఉండగా బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ తిప్పిపంపారు. జయలలిత గవర్నర్ చెన్నారెడ్డిని రీకాల్ చేయాలని డిమాండ్ చేసినా ఆయన మెట్టు దిగలేదు. గవర్నర్ గిరీకి నేను రబ్బరు స్టాంపును కాదలచుకోలేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపాయి.

వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి..

ఈ ప్రాంతంలోని చిన్నపల్లెటూరు నుంచి సీఎం, గవర్నర్ లాంటి అత్యున్నత పదవులను అలంకరించిన చెన్నారెడ్డి వికారాబాద్ ప్రాంతానికి ఎనలేని సేవలను అందించారు. జిల్లాలోని అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు 'కోట్‌పల్లి'నిర్మాణం ఆయన చలువే. దీంతో తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూరు మండలాల రైతులకు ఈ ప్రాజెక్టు కల్పతరువుగా మారింది. అదే విధంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు వికారాబాద్ పట్టణానికి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలోని శివారెడ్డిపేట వద్ద శివసాగర్ పేరుతో చెరువును తవ్వించారు. 1967లో ఈ చెరువు నిర్మాణం పూర్తిచేసుకుంది. ఈ చెరువే నేటికీ స్థానికుల దాహం తీరుస్తోంది. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే చాలా గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లను కంకర, బీటీ రోడ్లుగా మార్చి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చారని పెద్దలు గుర్తు చేస్తుంటారు. ప్రస్తుతం వికారాబాద్ పట్టణం ఎడ్యుకేషన్ హబ్‌గా పిలుస్తుంటారు. దీనికి కారణం విద్యకు తగిన ప్రోత్సాహన్ని ఇవ్వడంలో డాక్టర్.చెన్నారెడ్డి ఆనాడు వేసిన బీజమే. వికారాబాద్‌లో ఉన్నత విద్యావకాశాలను అప్పటి ప్రభుత్వాలు కల్పించకపోవడంతో 1965లోనే వికాస్ మండలిని స్థాపించి కళాశాలల ఏర్పాటుకు కృషిచేశారు. ఈ మండలికి మొదటి చైర్మన్‌గా ఆయనే వ్యవహరించారు. ఈ ప్రాంతంలో అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం ఉండడంతో 1968లో శ్రీ అనంత పద్మనాభ (ఎస్‌ఏపీ) పీయూసీ కళాశాలను అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిచే ప్రారంభింపచేశారు.

రాజకీయ ప్రస్థానం

1952, 1957 ఎన్నికల్లో మర్రి చెన్నారెడ్డి వికారాబాద్ నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఈ నియోజకవర్గం 1962లో ఎస్సీలకు రిజర్వు కావడంతో పక్క నియోజకవర్గమైన తాండూరు నుంచి పోటీచేశారు. 1962, 1967లలో తాండూరు నుంచి అసెంబ్లీకి వెళ్లారు. అనంతరం 1978లో మేడ్చల్ నుంచి పోటీచేసి గెలుపొంది ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. అనంతరం 1989లో సనత్‌నగర్ నుంచి పోటీచేసి గెలుపొందారు. 1978–79, 1989–90లలో రెండు పర్యాయాలు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు. ఈయన ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసేటప్పుడు అక్కడ శాంతిభద్రతల సమస్యలు తలెత్తగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించింది. దీంతో ఆయన రాష్ట్ర పరిపాలనా బాధ్యతలను నిర్వర్తించారు. 27 ఏళ్ల పిన్నవయసులోనే బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ మినిస్టర్‌గా పనిచేసి రికార్డు సృష్టించారు. తమిళనాడు గవర్నర్‌గా ఉండగానే ఆయన కన్నుమూశారు.



ఎన్నికల సంస్కరణ

- ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు
- 2018 ఎలక్షన్ నుంచి అమలు

మీకు తెలుసా?

వికారాబాద్ అర్బన్: ఎన్నికల సంఘం ఎప్పుడైనా ఓటరుకు ఏది సులభమో దానికే ప్రాధాన్యతనిస్తుంది. ఇందులో భాగంగానే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నూతన సాంకేతిక విధానం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానమే నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో అమలు చేసేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమైంది. ఇందుకు సంఘం తగు జాగ్రత్తలు తీసుకుంటుంది. 2018 ఎన్నికల ముందు ఈవీఎంలపై అభ్యర్థి పేరు, కేటాయించిన గుర్తు మాత్రమే ఉండేది. 2018 శాసన సభ ఎన్నికల నుంచి పోటీలో ఉండే అభ్యర్థి ఫొటోను పార్టీ గుర్తు పక్కన ప్రదర్శింస్తుంది. ఈవీఎంలలో అభ్యర్థుల పేరు, పార్టీ గుర్తుతోపాటు 2.5 సెంటీమీటర్ల పొడవుతో అభ్యర్థి ఫొటో ఉంటుంది. ఓటరుకు పార్టీ సింబల్ గుర్తు పట్టకపోయినా అభ్యర్థిని చూసి ఓటు వేసే వెసులుబాటు కలుగనుంది. నోటా వద్ద మాత్రం క్రాస్ గుర్తు ఉంటుంది. ఓటర్లు అభ్యర్థుల విషయంలో గందరగళానికి గురికాకుండా ఉండేందుకు ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు పోటీ చేసే అభ్యర్థులు మూడు నెలల క్రితం తీయించుకున్న స్టాంప్ సైజ్ కలర్ ఫోటోను నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారికి అంజేయాల్సి ఉంటుంది. ఫొటో వెనకాల రంగులు లేకుండా తెల్లగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

నిరుద్యోగి నామినేషన్

షాద్‌నగర్ అసెంబ్లీ బరిలో నిలిచేందుకు బుధవారం ఓ నిరుద్యోగి నామినేషన్ దాఖలు చేశారు. శంషాబాద్ మండలం పాల్మాకుల గ్రామానికి చెందిన సార వినయ్‌కుమార్ 2018లో జేఎన్టీయూ ఎంటెక్ పూర్తిచేశారు. ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి పోటీ చేస్తున్నట్లు. తాను నిరుద్యోగి, భార్య గృహిణి తమకు ఎలాంటి ఆదాయ వనరులు లేవని పేర్కొన్నారు. – షాద్‌నగర్



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పిస్తున్న నిరుద్యోగి వినయ్‌కుమార్

అమ్మా.. ఆశీర్వదించు!

బీఆర్‌ఎస్ కల్వకుర్తి అభ్యర్థి జైపాల్‌యాదవ్ నామినేషన్ వేయడానికి ముందుగా తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. బుధవారం ఆయన నగరం నుంచి చల్లంపల్లికి చేరుకుని ఆయన తల్లి మంగమ్మకు పాదాభివందనం చేశారు, అనంతరం కల్వకుర్తిలో నామినేషన్ దాఖలు చేశారు. – కడ్తాల్



తల్లి పాదాలకు నమస్కరిస్తున్న జైపాల్

తుది జాబితాలో పెరిగిన ఓటర్లు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల తుది జాబితాను అధికారులు ప్రకటించారు. పేర్ల నమోదుకు చివరి అవకాశం ఇవ్వడంతో నియోజకవర్గ ఓటర్లు భారీగా స్పందించారు.

- కొత్తగా 25,575 మంది ఓటర్లుగా తమ పేర్లను ఓటరు లిస్టులో నమోదు చేయించుకున్నారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల సంఖ్య 5,77,937 మందికి చేరింది.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో అధికం...

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్ నగర్, శాస్త్రీపురం డివిజన్‌లలో గతంలో 2,99,616 మంది ఓటర్లుగా నమోదయ్యారు. తుది జాబితాలో 13,831 మంది కొత్తగా చేరారు. దీంతో సర్కిల్ పరిధిలో ఓటర్ల సంఖ్య 3,13,447 మందికి చేరింది. సర్కిల్‌లోని 5 డివిజన్లలో దాదాపు 14 వేల కొత్త ఓటర్లు పేర్లు నమోదు చేయించుకున్నారు. ఎన్నికల్లో వీరి ఓటు కీలకంగా మారనుంది.

మండలాల్లో పెరిగిన ఓటర్లు...

- నియోజకవర్గ పరిధిలోని గండిపేట్ మండలంలో 8,630 మంది తుది జాబితాలో తమ పేర్లు నమోదు చేయించుకున్నారు.
- మండల పరిధిలో మొత్తం 1,77,631 ఓటర్లుగా తుది జాబితాలో నమోదయ్యారు. శంషాబాద్ మండలంలో అత్యల్పంగా 3,114 మంది తుది జాబితాలో ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేయించారు. శంషాబాద్ మండలంలో మొత్తం ఓటర్ల సంఖ్య 86,889కు చేరింది.

ఇతర ఓటర్ల సంఖ్య 44..

- నియోజకవర్గ పరిధిలో ఇతర ఓటర్లు 44 మందిగా నమోదయ్యారు. గతంలో 39 మంది ఉండగా తుది జాబితాలో ఇద్దరు పెరిగి, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 44 గా ఉంది.

కాంగ్రెస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు



భీంభరత్‌కు మద్దతు ప్రకటిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. బుధవారం ఆయన భీంభరత్ నివాసంలో పార్టీ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఐ పొత్తు ఖరారు కావడంతో చేవెళ్లలో భీంభరత్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించడమే లక్ష్యంగా సీపీఐ శ్రేణులు పనిచేస్తాయన్నారు. ఈ నెల 10న భీంభరత్ నామినేషన్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ రామస్వామి, కో కన్వీనర్, ప్రభులింగం, గోపాల్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ మండలాల పార్టీ కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, నాయకులు మక్బుల్, మల్లేశ్, రఘు, నారాయణ, మధు, రుక్కయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటే

సెలబ్రిటీ కామెంట్



మెరుగైన సామాజిక భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు హక్కు మాత్రమే. మంచి నాయకులను ఎన్నుకోవడానికి సరైన సమయం ఇదే. ఎన్నికల వేళ చేసే ఒకే ఒక్క పొరపాటుతో వ్యక్తిగతంగా, సామాజికంగా భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. ముఖ్యంగా యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటును అమ్ముకోవద్దు. ఓటు విలువను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలి. సామాజికంగా డబ్బు, కులం తదితర స్థాయిలుగా అసమానతలు నెలకొన్నాయి. కడుపు నిండినోళ్లు, కడుపు మండినోళ్ల మధ్య వ్యవస్థ కొనసాగుతోంది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు సామాన్యుల పక్షాన నిలుస్తూ కనీస అవసరాలు సమకూర్చేలా కృషి చేయాలి. సమ న్యాయపాలన చేస్తూ వెనుకబడిన వారి ఉన్నతికి కోసం ప్రయత్నించే వారే అసలైన నాయకులు.

– రఘు కుంచె, సంగీత దర్శకుడు– ప్లే బ్యాక్ సింగర్

ఆస్తులు రూ.2.71కోట్లు.. అప్పులు రూ.1.44కోట్లు

- ఎనిమిది కేసులు
- అఫిడవిట్‌లో పేర్కొన్న బీజేపీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి దయానంద్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: 2.71 కోట్ల విలువైన ఆస్తులు, వివిధ పోలీస్ స్టేషన్లలో ఎనిమిది కేసులున్నట్లు బీజేపీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి నోముల దయానంద్ గౌడ్ ఎలక్షన్ అఫిడవిట్లో పేర్కొన్నారు.

ఆస్తులు

చేతిలో రూ.35వేల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.లక్ష, రూ.36లక్షలు విలువ చేసే ఫార్చ్యూనర్, రూ.30లక్షల విలువైన బెంజ్ కార్లు, 12 తులాల బంగారం, ఇంజాపూర్‌లో రెండు ప్లాట్లు, తుమ్మలూరు పరిధిలో రూ.2కోట్ల విలువ చేసే 6570 చదరపు అడుగుల్లో రెసిడెన్షియల్ విల్లాతో కలిపి రూ.2,71,40,000 ఆస్తులను చూపగా రూ.1,44,22,308 అప్పులున్నట్లు పేర్కొన్నారు.

సతీమణి జయలక్ష్మి పేరిట

చేతిలో రూ.21 నగదు, బ్యాంకు ఖాతాలో రూ.5వేలు, 21 తులాల బంగారం, మొత్తం ఆస్తులు రూ.15,06,122

పెద్ద కుమారుడు కార్తీక్ కుమార్ పేరిట



పెద్ద కుమారుడు కార్తీక్‌కుమార్ చేతిలో నగదు రూ.8వేలు, బ్యాంకు ఖాతాలో రూ.30వేలు, ఒక బైక్, 5 తులాల బంగారం, మొత్తం ఆస్తులు రూ.4,45,810

చిన్న కుమారుడు భరత్‌కుమార్ పేరుతో..

చిన్న కుమారుడు భరత్‌కుమార్ చేతిలో రూ.8 వేలు, బ్యాంకు ఖాతాలో రూ.20 వేలు, రూ.20లక్షలు విలువచేసే 2011 మోడల్ ఆడి, రూ.14 లక్షలు విలువచేసే 2012 మోడల్ ఇన్నోవా కార్లు, 4 తులాల బంగారం, మొత్తం ఆస్తులు రూ. 37,09,928 ఉన్నాయి. వాహనాల లోన్స్‌తోపాటు ఇతర అప్పులు మొత్తం రూ.60,34,964 ఉన్నట్లు చూపారు.

ఎన్నికల 'దీపావళి'

భాగ్యనగరిలో ఈసారి దీపావళి స్పెషల్‌గా ఉండనుంది. ఎన్నికల నేపథ్యంలో విభిన్నమైన సందడి కన్పిస్తోంది. దీపావళి స్పెషల్ వివిధ రకాల స్వీట్లు, బాణసంచాకు ఈ ఏడాది భారీగా డిమాండ్ ఏర్పడింది. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీల నేతలు పండగ వేళ ఓటర్లకు బహుమతులు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, కాలనీలు, ఉద్యోగ సంఘాల వారికి మిఠాయిలు, టపాసులు బాక్సుల రూపంలో ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ మిఠాయిల షాపులకు భారీగా ఆర్డర్లు ఇచ్చారట. దీంతో దీపావళికి మిఠాయి దుకాణాలకు ఈఏడాది రెట్టింపు గిరాకీ ఉండనుంది. మొత్తమ్మీద దీపావళి సందడిని రాజకీయ పార్టీలు ఓటర్ల మన్ననలు పొందడానికి ఉపయోగించుకుంటున్నారు. స్వీట్లు, బాణసంచా, డ్రైఫ్రూట్స్ ధరలకు రెక్కలు వచ్చాయి.

– సాక్షి, సిటీబ్యూరో